క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్

26-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 247

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



సందీప్‌కు కత్తి మీద సామే!

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలు అంత సులువు కాదు

కట్టు దాటుతున్న క్రమశిక్షణ

లక్ష్మణ రేఖ దాటుతున్న సీనియర్లు

కొత్త ఇన్‌చార్జ్ కు అనేక సవాళ్లు

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

కాంగ్రెస్.. ఈ మాట వింటేనే అంతర్గత విభేదాలు, వర్గాల కుమ్ములాటలు, నేతల మధ్య ఆధిపత్య పోరు వంటివి కనిపిస్తాయి. అందులోనూ తెలంగాణలో ఈ సంస్కృతి అధికం. అందుకే ఇక్కడ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా వచ్చే వారికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతుంటాయి. నేతల మధ్య సమన్వయం కత్తి మీద సాము లాంటిది. అటువంటిది కర్ణాటక కు

- మిగతా 3వ పేజీలో

ముఖ్యమంత్రి ప్రేమ కథ!

ప్రేమించిన యువతి కోసం 1750 కిలోమీటర్ల బైక్ ప్రయాణం

ఢిల్లీకి వెళ్లి మరి వివాహ ప్రయత్నం

రేవంత్ లవ్ స్టోరీ లో గట్టి పోరాటం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణ సీఎం రేవంత్ పొలిటికల్ జర్నీ ఒక సంచలనమే. డేరింగ్ అండ్ డైనమిక్ తో ఆయన రాణించిన తీరు యువ నాయకత్వానికి ఆదర్శమే. కొడంగల్ ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు.. అంతకుముందు ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు.. ప్రతి సందర్భంలోనూ

- మిగతా 2వ పేజీలో





ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేటు!

తెలంగాణ కాంగ్రెస్ పై ఏఐసీసీ ఫుల్ ఫోకస్

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై సీరియస్

చర్యలకు ఉపక్రమించే అవకాశం

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై అధిష్టానం పూర్తిగా దృష్టి పెట్టింది. ఇటీవల పార్టీలో అసమ్మతి గళాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల

- మిగతా 2వ పేజీలో

కాకినాడలో హోరాహోరీ!

రెండు పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్టు పోరాటం

కూటమి వైపే ఎడ్జ్

క్రైమ్ మిర్రర్ గ్రౌండ్ రిపోర్ట్



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: ఏపీలో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి కాకినాడ కార్పొరేషన్ పై ఉంది. విలీన పంచాయితీల వివాదం కొలిక్కి రావడంతో 48 నుంచి 66 డివిజన్లకు విస్తరించింది ఈ కార్పొరేషన్. సుమారు రెండు లక్షల 85 వేల మంది ఓటర్లు మేయర్ పీఠాన్ని నిర్ణయించనున్నారు. బీసీ మహిళకు రిజర్వ్ అయిన ఈ మేయర్ స్థానం కోసం

- మిగతా 3వ పేజీలో



ఎమ్మెల్సీగా కొండా మురళి?!

గవర్నర్ కోటా కింద ఎంపికకు ప్రయత్నం

ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం అయింది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో సందడి మొదలైంది. వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గట్టి ప్రయత్నాలతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇటీవల ఆయన భార్య కొండా సురేఖ మంత్రి పదవి నుంచి డిస్మిస్ అయ్యారు. వారి కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో సెప్టెంబర్ 3న కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి తొలగించారు. ఆ తర్వాత కొండా దంపతులు పార్టీ మారుతారు అంటూ జోరుగా ప్రచారం నడిచింది. అయితే తాము కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతామని.. పార్టీని వీడియో

- మిగతా 2వ పేజీలో



రాహుల్ సెంటిమెంట్ పాలిటిక్స్!

తండ్రి మరణాన్ని గుర్తుచేస్తూ సానుభూతికి ప్రయత్నం

రాజీవ్ హత్య సమయంలో భద్రత తగ్గించాలని ఆరోపణ

ప్రత్యేక వీడియో విడుదల

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్

కాంగ్రెస్ జాతీయస్థాయిలో పుంజుకోవాలని చేయని ప్రయత్నం అంటూ లేదు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ సానుభూతి రాజకీయాలను నమ్ముకున్నారు. తాజాగా తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య అంశాన్ని తెరపైకి తెస్తూ సానుభూతి రాజకీయాలకు తెర లేపారు. తన తల్లి సోనియా గాంధీ రచించిన ఆత్మకథ బి లాగింగ్ పుస్తకావిష్కరణ తర్వాత ప్రమోషన్ల కోసం.. సోనియా, ప్రియాంక గాంధీ లతో కలిసి కూర్చొని మాట్లాడిన ఒక ప్రత్యేక వీడియోను రాహుల్ గాంధీ విడుదల చేశారు.

- మిగతా 2వ పేజీలో

గుడివాడలో గెలుపెవరిది?!

గట్టి అభ్యర్థులను బరిలోదించిన కొడాలి నాని

ఆర్థిక ప్రోత్సాహం

నేరుగా రంగంలోకి దిగకపోవడం మైనస్

పట్టణం పై పట్టు సాధించిన ఎమ్మెల్యే వెనిగండ్ల

కూటమి వైపే ఫలితం మొగ్గు

క్రైమ్ మిర్రర్ గ్రౌండ్ రిపోర్ట్



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: గుడివాడ.. ఈ పేరుకు ఒక బ్రాండ్ ఉంది. నందమూరి తారకరామారావు పుట్టిన నేల అది. అందుకే ఆ నియోజకవర్గం నుంచి ఆయన ప్రాతినిధ్యం వహించారు. అయితే గత కొంతకాలంగా

- మిగతా 2వ పేజీలో

పంజాబ్‌లో ఎన్డీఏ!



చేతులు కలిపిన బిజెపి, అకాలిదళ్

ఆరేళ్ల తరువాత మళ్లీ కలయిక

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్: వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అక్కడి రాజకీయాల్లో కీలక మలుపు చోటు చేసుకుంది. 2020లో వ్యవసాయ చట్టాల వివాదంతో విడిపోయిన పాత మిత్రులు భారతీయ జనతా పార్టీ, శిరోమణి అకాలిదళ్ ఆర్యల విరామం తర్వాత మళ్లీ చేతులు కలిపాయి. ఢిల్లీ వేదికగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్, అకాలిదళ్ అధినేత సుఖబీర్ సింగ్ బాదం కలిసి 2027 పంజాబ్ ఎన్నికల్లో తాము కలిసి పోటీ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇంతవరకు ఎన్నడూ హంగ్ అసెంబ్లీని చూడని పంజాబ్లో.. ఇప్పుడు అమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయి. బలహీనపడ్డ అకాలి దళ్, పట్టణ ప్రాంతాలకు పరిమితమైన బిజెపి కలిసి మూడో బలమైన ప్రత్యామ్నాయంగా అవతరించాలని భావిస్తున్నాయి.

ఓట్ల బదిలీ జరిగేనా?

అయితే ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరింది. కానీ అసలు సవాల్ ఓట్ల బదిలీ. గ్రామీణ నియోజకవర్గాల్లో బిజెపి ఓటర్లు అకాలిదళ్ అభ్యర్థులకు ఓటు వేస్తారా? పట్టణ ప్రాంతాల్లో సంప్రదాయ అకాలిదళ్ ఓటర్లు బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇస్తారా? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు విడివిడిగా

- మిగతా 2వ పేజీలో

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తున్న నేతల అరెస్ట్‌పై కేటీఆర్ మండిపాటు

ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని పోలీసులతో అణచివేయడం సరికాదని వ్యాఖ్య

ట్రక్ పార్క్ భూమి వేలాది మందికి జీవనోపాధి అన్న కేటీఆర్



కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి



కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన విపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయా లని చూడటం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా అఖిలపక్ష నేతలు చేపట్టిన నిరసన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులతో పాటు పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంపై కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. "కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి అని కేటీఆర్ స్పష్టం చేశారు. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన స్థలాలను వేలం వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాహుల్ సెంటిమెంట్ పాలిటిక్స్!

1991లో రాజీవ్ గాంధీ హత్యకు గురికావడానికి ముందు ఆయనకు ముప్పు ఉందని తెలిసినప్పటికీ.. కావాలనే కుట్రపూరితంగా భద్రతను తగ్గించారని.. ఆయన హత్యకు అనుకూల వాతావరణం సృష్టించారని రాహుల్ గాంధీ ఆ వీడియోలో ఆరోపణలు చేశారు. 1991లో బీహార్ ఎన్నికల ప్రచార పర్యటనలో రాజీవ్ గాంధీ ప్రయాణిస్తున్న ఓపెన్ జీప్ పై రాళ్లు విసిరిన ఘటనను.. సోనియా గాంధీ గుర్తుచేసుకోగా.. అప్పుడే తన తండ్రి భద్రతపై తాను ఆందోళన చెంది తండ్రితో వాదించానని రాహుల్ భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.

గతంలో ఇదే పంథాతో..: సానుభూతితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భాలు అధికం. 1984లో ఇందిరా గాంధీ హత్య తర్వాత కానీ.. 1991లో రాజీవ్ గాంధీ విషాదకరమరణం తర్వాత కానీ.. ఆ సానుభూతి పవనాలను కాంగ్రెస్ పార్టీ గరిష్టంగా ఓట్లుగా మలుచుకుని అధికారాన్ని దక్కించుకుంది. అయితే రాజీవ్ గాంధీ హత్య జరిగి దాదాపు మూడున్నర దశాబ్దాలు గడిచిపోయాయి. అయితే ప్రస్తుత తరం వాటర్ లను ఆకట్టుకునేందుకు రాహుల్ గాంధీ మళ్లీ అదే పాత సానుభూతి కార్డును బయటకు తీయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ముఖ్యంగా అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం ఎస్పీజీ భద్రత ను ఉపసంహరించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. చట్టపరంగా జరిగిన మార్పులను సైతం ఏదో పెద్ద రాజకీయ కుట్రగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం వెనుక.. రాబోయే ఎన్నికల వ్యూహాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం.

భిన్న వాదన..: అయితే రాహుల్ ఎంచుకున్న మార్గంపై భిన్న వాదన వినిపిస్తోంది. వర్తమాన రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడంలో.. ప్రజల్లో బలమైన భరోసా నింపడంలో తడబడుతున్న రాహుల్ గాంధీ.. ఈ తరహా భావోద్వేగ వీడియోలతో సానుభూతి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలు కాస్త అతిగా ఉన్నాయి. 2004లో ప్రధాని పదవిని సోనియా గాంధీ త్యాగం చేశారంటూ పాత జ్ఞాపకాలను, వ్యక్తిగత దాడులను మళ్లీ మళ్లీ తవ్వి తీయడం ద్వారా.. గాంధీ కుటుంబం చుట్టూ సానుభూతి వలయాన్ని నిర్మించాలని చూస్తున్నా.. నేటి యువ వాటర్ల పాత చరిత్ర కంటే భవిష్యత్ ప్రణాళికలకే ప్రాధాన్యత ఇస్తారన్న వాస్తవాన్ని కాంగ్రెస్ విస్మరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒక ఇంటి పెద్దగా, తండ్రి మరణం ఏ కుటుంబానికైనా తీరని విషాదమే. కానీ దానిని 35 ఏళ్ల తర్వాత కూడా రాజకీయ అస్త్రంగా వాడుకోవాలని చూడడం కాంగ్రెస్ పార్టీకి ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేటు!

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సొంత ప్రభుత్వం పైనే విమర్శలు చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి అయితే సీఎం రేవంత్ పై విరుచుకుపడుతున్నారు. దీనిపై టిపిసిసి కూడా దృష్టి పెట్టింది. మరోవైపు ఈ ఇద్దరు తీరు పై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్ కర్నూలు ఎంపీ డాక్టర్ మల్లు రవి ప్రత్యేక ప్రస్తావన తీసుకొచ్చారు.. ఆ ఇద్దరూ లక్ష్మణ రేఖను దాటి మాట్లాడినట్టు వచ్చిన ఫిర్యాదులను తాను టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్కు వివరించానని.. ఆయన ఆ విషయాన్ని ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇటీవల ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రభుత్వ విధానాలు, నాయకత్వంపై బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ కాంగ్రెస్ నూతన వ్యవహారాల ఇంచార్జ్ సందీప్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఈ ఇద్దరిపై చర్యలు తప్పవని సంకేతాలు వెలువడుతున్నాయి.

కొత్త ఇన్చార్జ్ బాధ్యతలు..: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా బిఎం సందీప్ నియమితులైన సంగతి తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన ఆయన కాంగ్రెస్ పార్టీ పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులు, నేతల మధ్య ఉన్న సమీకరణలు, అసంతృప్తికి గల కారణాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశాలతో పాటు అసమ్మతి వ్యక్తం చేస్తున్న నేతలతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించినందుకే అధిష్టానం ప్రాధాన్యం ఇస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆ కారణాలతోనే..: వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా రెండోసారి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో సైతం మెజారిటీ ఎంపీ స్థానాలను పొందాలని చూస్తోంది. ఇటువంటి సమయంలో క్రమశిక్షణ కట్టు దాటిన నేతలపై వేటు వేసేందుకు సిద్ధపడుతోంది. అయితే తక్షణమే వేటు వేయడం వంటి నిర్ణయాలు తీసుకోవడం కంటే భవిష్యత్తులో ఎవరైనా మరోసారి గీత దాటి బహిరంగ విమర్శలకు దిగితే మాత్రం.. ఉపేక్షించేది లేదన్న బలమైన సంకేతాలను ఏఐసీసీ పంపించనుందని పరిశీలకులు భావిస్తున్నారు. పార్టీలో అంతర్గత సమస్యలు లేదా అభిప్రాయ భేదాలు ఏవైనా ఉంటే వాటిని పార్టీ వేదికలపై చర్చించాలని.. బహిరంగ వేదికలపై మాట్లాడడం

ముఖ్యమంత్రి ప్రేమ కథ!



రేవంత్ రెడ్డి తనదైన మేనరిజాన్ని చూపించారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అదే దూకుడుతో వ్యవహరిస్తున్నారు. ప్రత్యర్థుల మీద విమర్శలు చేయడంలో, రాజకీయ వ్యూహాలు రచించడంలో రేవంత్ రెడ్డి శైలి ఎప్పటికీ ప్రత్యేకమే. ఒక రాజకీయ నాయకుడిగా రేవంత్ రెడ్డి తాను అనుకున్న లక్ష్యాలను సాధించారు. అనతి కాలంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆ యంగ్ డైనమిక్ లీడర్ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. బయట ప్రపంచానికి పెద్దగా తెలియదు. ముఖ్యంగా ఆయన ప్రేమ కథ ఉందన్న విషయం బయటకు రాలేదు కూడా. కానీ తొలిసారిగా ఆ విషయాన్ని బయటపెట్టారు సీఎం రేవంత్.

జరిగింది ఇది..

రేవంత్ రెడ్డి ప్రేమ వివాహం. ఆయన భార్య పేరు గీత. ఇంటర్ చదివే రోజుల్లోనే రేవంత్ ఆమెను ప్రేమించారు. అప్పట్లో ఒకసారి నాగార్జునసాగర్ కు వెళ్ళినప్పుడు వారిద్దరి మధ్య పరిచయం మొదలైంది. ఆ స్నేహం కాస్త ప్రేమగా రూపాంతరం చెందింది. రేవంత్ రెడ్డి ముందుగా గీతకు తన ప్రేమను వ్యక్తం చేశారు. ఆయన ధైర్యాన్ని చూసి.. వ్యక్తిత్వాన్ని ఇష్టపడి.. ముక్కు సూటితనాన్ని నచ్చి రేవంత్ రెడ్డికి గీత గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

పెద్దల అభ్యంతరం..

అన్ని ప్రేమ కథల్లో మాదిరిగానే రేవంత్ రెడ్డి ప్రేమ కథలు కుటుంబాల నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. అప్పటికి ఇంకా రేవంత్ రాజకీయాల్లోకి రాలేదు. ముందుగా గీత కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకరించలేదు. ఉన్నత చదువుల నిమిత్తం గీతను ఢిల్లీలో ఉంటున్న ఆమె బాబాయి.. కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి వద్దకు పంపించారు. అయినా రేవంత్ రెడ్డి ఎక్కడ వెనక్కి తగ్గలేదు. తన ప్రేమను పెళ్లి దాకా తీసుకెళ్లాలని భావించారు. అందుకే ఏకంగా ఆయన బైక్ పై ఢిల్లీ వెళ్లారు. ఒకటి కాదు రెండు కాదు సుమారు 1750 కిలోమీటర్ల దూరం బైక్ పై ప్రయాణం చేశారు. రైలు లేదా విమానంలో వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి బైక్ మీద ప్రయాణం చేయడం అతనిలో ఉన్న పట్టుదలకు నిదర్శనం. అయితే అప్పట్లో రేవంత్ నేరుగా జైపాల్ రెడ్డితోనే మాట్లాడారు. తన ప్రేమ విషయాన్ని బయటపెట్టారు. పెళ్లికి ఒప్పుకునే విధంగా ఆయనను ఒప్పించారు. రేవంత్ రెడ్డిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, మాటతీరు జయపాల్ రెడ్డి ని ఆకట్టుకున్నాయి. దీంతో జైపాల్ రెడ్డి గీత తండ్రిని ఒప్పించారు. దీంతో ఇరు కుటుంబాల పరస్పర అంగీకారం మేరకు 1992 మే 7న రేవంత్ రెడ్డి, గీతా వివాహ బంధం ద్వారా ఒక్కటయ్యారు.

ఆ ప్రదేశాన్ని సందర్శించి..

ఇటీవల నాగార్జునసాగర్ లో వరుణ యాగం జరిగింది. రేవంత్ దంపతులు హాజరయ్యారు. తన సతీమణి గీతతో కలిసి అక్కడకు వెళ్లారు. తమ ప్రేమకు తొలి అడుగు పడిన ప్రాంతాన్ని సందర్శించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి పాత ఫోటోలు కూడా ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రేమ కోసం 1750 కిలోమీటర్ల దూరం బైక్ మీద ప్రయాణించడం ఒక గొప్ప సాహసమే. రేవంత్ రాజకీయాల్లోనే కాదు.. తన ప్రేమను సఫలం చేసుకోవడానికి గట్టి పోరాటమే చేశారని అర్థం అవుతోంది.

ఎమ్మెల్సీగా కొండా మురళి?!

(మొదటి పేజీ తరువాయి)

ప్రసక్తి లేదని వారు స్పష్టం చేశారు. కొండా సురేఖ మంత్రివర్గం నుంచి తొలగింపు నేపథ్యంలో ఆమె భర్త మురళికి పార్టీ పదవి ఇస్తారని అప్పట్లో ప్రచారం నడిచింది. అందుకే ఇప్పుడు ఎమ్మెల్సీ ఇవ్వబోతున్నారన్న టాక్ నడుస్తోంది.

లి వరంగల్ జిల్లా పై పట్టు..

వరంగల్ జిల్లాలో కొండా ఫ్యామిలీకి మంచి పట్టు ఉంది. సురేఖ మంత్రి పదవి కోల్పోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తమ రాజకీయ పట్టు, ఆధిపత్యం తగ్గిపోతుందన్న భావన ఉన్న మురళి.. అందుకు ప్రత్యామ్నాయంగా తనకు గవర్నర్ కోట ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఢిల్లీ అధిష్టానం స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బలమైన నేతలుగా ఉన్న తమ కుటుంబానికి మంత్రి పదవి లేకపోవ డం వల్ల కేడర్ లో నైతిక స్థైర్యం దెబ్బతింటోందని.. అందుకే తమ అనుచరులు సైతం ఇతర పార్టీల వైపు చూస్తున్నారని మురళి అధిష్టానం పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఐసిసి ఇన్చార్జ్ బిఎం సందీప్ తో పాటు ఢిల్లీలోని కీలక నేతల వద్ద ఆయన తన వాదనను గట్టిగా వినిపిస్తున్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ఒకవేళ తనకు ఎమ్మెల్సీ పదవి దక్కితే వరంగల్ రాజకీయాల్లో తిరిగి తమ కుటుంబ ప్రాబల్యం నిలబెట్టుకోవచ్చని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుచరులకు అండగా నిలవచ్చని ఆయన భావిస్తున్నారు.

సుముఖత చూపని రాష్ట్ర నాయకత్వం..

కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చే విషయంలో రాష్ట్ర నాయకత్వం అంత సుముఖంగా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి తో కొండ కుటుంబానికి విభేదాలు ఉన్నాయి. సురేఖను క్యాబినెట్ నుంచి తప్పించే వరకు పరిణామాలు వెళ్లడంతో.. ఇప్పుడు అదే కుటుంబానికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టడం సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దీనికి తోడు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదవీకాలం ముగిసిన మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యకు మరోసారి అవకాశం ఇవ్వాలని చర్చ కూడా నడుస్తోంది. ఇటువంటి సమయంలో కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి అనేది ఇస్తారు అనుకోవడం అతి అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 30 మందికి పైగా సీనియర్లు పోటీపడుతున్నారు. అయితే కొండా మురళి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయా? లేదా? అన్నది చూడాలి.

కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 1 టీఎంసీ నీళ్లు తేవాలి: శ్రీనివాస్ గౌడ్

తుంగభద్ర నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలన్న శ్రీనివాస్ గౌడ్

ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరివ్వకుంటే 20 వేల ఎకరాల్లో పంట నష్టమని వ్యాఖ్య

తుమ్మిళ్ల, ఆర్డీఎస్ చివరి తడులకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్

తుంగభద్ర జలాశయం నుంచి రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆయకట్టుకు తక్షణమే చివరి తడుల కోసం 1 టీఎంసీ నీటిని విడుదల చేయించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తుంగభద్ర నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయని శ్రీనివాస్ గౌడ్ వివరించారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీటి విడుదల ఆగడంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆర్డీఎస్ పరిధిలోని 12 నుంచి 22వ డిస్ట్రిబ్యూటరీ గ్రావిటీ కెనాల్స్ కింద సాగవుతున్న సుమారు 10 వేల ఎకరాలకు చివరి తడులు అందడం లేదన్నారు. అలాగే తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని మరో 10 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందక మొత్తం 20 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గుడివాడలో గెలుపెవరిది?!

ఆ నియోజకవర్గం మరింత పాపులర్ అయింది. దానికి కారణం మాజీ మంత్రి కొడాలి నాని. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పనిచేస్తున్న నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ గుడివాడ నియోజకవర్గాన్ని ఒక సంచలనంగా మార్చేశారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయన అనుహ్యంగా ఓడిపోయారు. దీంతో ఆయన పరిస్థితి ఒక్కసారిగా తారుమారు అయింది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో తన పట్టు నిలుపుకునేందుకు ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు. కానీ అది అంత సులువుగా జరిగే వ్యవహారం కాదు.

కీలక పట్టణం..

కృష్ణా జిల్లాలో కీలక పట్టణంగా గుడివాడ ఉంది. అక్కడ మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. 48 వార్డులు, ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎంపిక బీసీ మహిళా చైర్పర్సన్ పదవి కోసం నవంబర్ 26న పోలింగ్ జరగనుంది. 30న ఫలితం రానుంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు వెనిగండ్ల రాము. పట్టణం పై పూర్తి పట్టును నిలుపుకుంటూ వచ్చారు. అయితే ఇప్పుడు వైసీపీ తరఫున అన్ని తానై వ్యవహరిస్తున్నారు కొడాలి నాని. వైసిపి అభ్యర్థుల తరఫున పరోక్షంగా పావులు కదుపుతూ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నామినేషన్ల నుంచి అభ్యర్థుల ప్రచారం వరకు, ఆర్థిక వనరులను సమకూర్చడంలోనూ కొడాలి నాని తెరవెనుక పాత్ర పోషిస్తున్నారు.

బలం అంతంతే..

అయితే గుడివాడలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో బలం కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో వెనిగండ్ల రాము ఘన విజయం సాధించిన తర్వాత పట్టణ స్థాయిలో మళ్లీ బలం పుచ్చుకోవాలని వైసిపి ప్రయత్నిస్తోంది. 48 వార్డుల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టడం.. ఓటమిలో కొన్ని వార్డుల్లో టికెట్ల ఆశావాహుల మధ్య నెలకొన్న పోటీ వంటి అంశాలు ఎన్నికలను హోరాహోరీగా మారుస్తున్నాయి. కొడాలి నాని గతంలో సుదీర్ఘకాలం నియోజకవర్గంలో రాజకీయాలు చేయడం, ఆయనకు ఉన్న క్యాడర్ బలం, ఈ ఎన్నికల్లో అభ్యర్థులకు అందుతున్న ఆర్థిక మద్దతు వైసీపీకి ప్రధాన బలాలు. కొడాలి నాని నేరుగా జోక్యం చేసుకోలేకపోయినా.. గట్టిగా పోరాడాలన్న సంకేతంతో అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళుతున్నారు. అయితే ఇటీవల ప్రాదేశిక ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడంతో.. ఒక రకమైన ఆందోళన వైసీపీలో కనిపిస్తోంది. కీలక నేతగా ఉన్న నాని నేరుగా ప్రచారంలో ముందుండి నడిపించకపోవడం స్పష్టమైన లోటు.

ఎమ్మెల్యే కు పట్టు..

కూటమికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బలం. గెలిచిన తర్వాత ఆయన పట్టణం పై పూర్తిగా పట్టుబిగించారు. వార్డుల వారీగా సమన్వయం చేసుకోవడం ప్లస్ పాయింట్. ఇటీవల జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం.. ఆ ప్రభావం ఈ ఎన్నికలపై పడింది. 48 వార్డుల్లో టికెట్లు ఆశించిన కొందరు నేతల్లో అసంతృప్తి వల్ల కొన్నిచోట్ల ఓట్లు చిలే అవకాశం ఉంది. వైసిపి అభ్యర్థులకు అందుతున్న ఆర్థిక బలాన్ని, వార్డు స్థాయిలో పాత అనుబంధాలను తట్టుకొని ప్రతి వార్డును గెలుచుకోవడం కూటమికి సవాలే. ప్రస్తుతం క్షేత్రస్థాయి పరిస్థితులు, 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ఇటీవల స్థానిక ఎన్నికల ట్రెండ్, అధికార కూటమి బలాన్ని పరిశీలిస్తే గుడివాడ మున్సిపాలిటీలో కూటమికి మెరుగైన విజయవకాశాలు కనిపిస్తున్నాయి.

పంజాబ్‌లో ఎన్డీఏ!

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేసి ఒక్క సీటు కూడా గెలవలేకపోయాయి. రెండింటికి కలిపి దాదాపు 32 శాతం ఓట్లు వచ్చాయి. ఈ లెక్కలే మళ్లీ వీరిని దగ్గర చేశాయి. దీనికి తోడు పంజాబ్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఎక్స్ ఫ్యాక్టర్ దళిత ఓటు బ్యాంక్, దేశంలోనే అత్యధికంగా 32 శాతం దళిత జనాభా ఉన్న పంజాబ్ లో.. వీరి ఓట్లు ఏ వైపు మొగ్గుచూపితే ఆ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. 2022 ఎన్నికల్లో 117 స్థానాలకు గాను ఏకంగా 92 సీట్లు గెలుచుకొని ఆప్ సునామీ సృష్టించింది. అయితే ఐదేళ్ల పాలన తర్వాత సహజంగానే ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది.

తగ్గిన ఆప్ గ్రాఫ్..

ప్రధానంగా పంజాబ్లో శాంతిభద్రతల సమస్య, డ్రగ్స్ మహమ్మారి పూర్తిగా అదుపులోకి రాకపోవడం, మహిళలకు నేలకు ?1000 ఇచ్చే హామీ అమలులో జాప్యం వంటివి ఆప్ గ్రాఫ్ ను కొంతమేర తగ్గించాయి. 2024 లోక్ సభ ఎన్నికల్లోను ఆప్ కేవలం మూడు సీట్లకే పరిమితం కావడం ఆ పార్టీకి గట్టి హెచ్చరికగా మారింది.

సంక్షేమ పథకాలు..: అయితే పంజాబ్ విషయంలో ఒక్క మాట మాత్రం నిజం. అక్కడ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అమలు చేస్తున్న 300 యూనిట్ల ఉచిత విద్యుత్, మొహల్లా క్లినిక్ లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి పథకాల వల్ల గ్రామీణ పేదలు, ముఖ్యంగా దళిత, మధ్యతరగతి వర్గాల్లో ఆప్ కు ఇప్పటికీ బలమైన పట్టు ఉంది. ఇప్పుడు బిజెపి, అకాలీ దళ్ పొత్తు కుదరడం వల్ల ఆప్ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్, ఎన్డీఏ కూటమి మధ్య చీలిపోయే అవకాశం ఉంది. అదే జరిగితే త్రిముఖ పోటీలో ఆ చీలిక ఆమ్ ఆద్మీ పార్టీకి మరోసారి కలిసి వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి పాత మిత్రుల కలయిక, దళిత ఓటర్ల తీర్పు, ఆప్ ప్రభుత్వ సంక్షేమ పథకాల మధ్య 2027 పంజాబ్ ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగనున్నాయి.



సందీప్‌కు కత్తి మీద సామే!

(మొదటి పేజీ తరువాయి)

చెందిన కాంగ్రెస్ నేత బిఎం సందీప్ కొత్త ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆయనకు ఎన్నెన్నో సమస్యలు ఉన్నాయి. నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ ఎన్నికలు ఇలా అన్ని రకాల సమస్యలు ఎదుర్కాబోతున్నాయి. క్రమశిక్షణ విషయంలో గీత దాటుతున్న నేతలను కట్టడి చేయడం అంత సులువైన విషయం కూడా కాదు. ఎమ్మెల్యేలు కట్టు దాటి మాట్లాడుతున్నారు. నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూసిన పార్టీ కార్యకర్తలు పూర్తి అసహనంతో ఉన్నారు. దీనికి తోడు కొందరు సీనియర్ మంత్రులు సీఎం పైనే నేరుగా హైకమాండ్కు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో కొత్త ఇంచార్జ్ పార్టీని ఏ విధంగా గాడిలో పెడతారు అనేది ఆసక్తికరం.

లి ఆ కారణంతోనే..

కాంగ్రెస్ హై కమాండ్ రాష్ట్రాల్లో పార్టీని అదుపులో పెట్టుకునేందుకు ఇన్చార్జి వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన కీలక నేతలను ఇన్చార్జిలుగా నియమిస్తూ వచ్చింది. అయితే ఇప్పుడు ఇన్చార్జిగా నియమితులైన సందీప్ కు ప్రత్యక్ష రాజకీయాలతో పెద్దగా సంబంధం లేదు. ఆయన రాహుల్ గాంధీ టీమ్ లో ఒకరు. అయితే అదే రాహుల్ టీం నుంచి తెలంగాణ ఇన్చార్జిగా పనిచేశారు మీనాక్షి నటరాజన్. ఆమె ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లడంతో తన టీంలో మరో సభ్యుడైన సందీప్ కు అవకాశం ఇచ్చారు రాహుల్. కేవలం ఏఐసీసీకి సన్నిహితుడైన కారణంతోనే ఆయనకు బాధ్యతలు అప్పగించారనే టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. అందుకే తెలంగాణ కాంగ్రెస్ లో పరిణామాలను ఎలా పరిష్కరిస్తారు అన్నది సందేహమే.

లి సీనియర్లు అన్న అహంభావం..

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో విచిత్ర పరిస్థితి



కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి తమకంటి జూనియర్ అన్న భావన కొంతమంది మంత్రులతో పాటు కీలక నేతల్లో ఉంది. అందుకే ఆయనపై ఎక్కువగా తిరుగుబాటు చేస్తున్నారు. కానీ ఇప్పుడు ఇన్చార్జిగా నియమితులైన సందీప్ కూడా వారి కంటే జూనియర్. వయసులో సీనియర్లతోపాటు అనుభవపరంగా చాలామంది సీనియర్లు తెలంగాణలో ఉన్నారు. అటువంటివారిని ఇంచార్జ్ హోదాలో ఎలా నియంత్రిస్తారో చూడాలి. అయితే రాహుల్తో ఉన్న సంబంధాల దృష్ట్యా కచ్చితంగా వారిని నియంత్రణలో పెడతారన్న టాక్ ఉంది. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ఉన్నారు. కానీ ఆయన అనుకున్న స్థాయిలో పనిచేయలేకపోతున్నారు. ఇంతవరకు కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేసుకోలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏకాభిప్రాయం కుదరకపోవడమే అందుకు కారణం. సందీప్ ఆ సాహసం చేస్తారా లేదా అనేది చూడాలి.

లి నామినేటెడ్ పెండింగ్..

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటుతోంది. కానీ ఆరు నెలల కిందట ఖాళీ అయిన నామినేటెడ్ పదవులను భర్తీ చేయకుండా పెండింగ్లో పెట్టారు. దీంతో వేలాదిమంది ద్వితీయ శ్రేణి నాయకులు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. జాప్యం జరుగుతున్న కొలది నిరసన కూడా తెలుపుతున్నారు. అయితే ఈ పదవుల పంపకాలతో తేడా కొడితే అసమతి బయటపడుతుందని పార్టీ హైకమాండ్ భయపడుతోంది. దీనికి తోడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తున్నాయి. వాటిలో కచ్చితంగా గెలవాలి. గెలవకపోతే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. వీటన్నింటినీ కొత్త ఇంచార్జ్ సందీప్ ఎలా గాడిలో పెడతారు అన్నది ఇప్పుడు ప్రశ్న. చూడాలి చివరకు ఏం జరుగుతుందో..

మొక్కజొన్న కొరతపై సీఎం కీలక ఆదేశాలు..
పౌల్ట్రీకి ప్రాధాన్యత రంగం హోదా

పౌల్ట్రీ పరిశ్రమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రత్యేక విధానాలు

గ్రామ పంచాయతీల్లో యూనిట్ల ఏర్పాటుకు సింగిల్ విండో అనుమతులు

హైదరాబాద్: పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన మొక్కజొన్న అందుబాటులో లేకపోతే ఉత్పత్తి రంగంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ సమస్యను పరిశ్రమ ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. మొక్కజొన్న కొరత అంశాన్ని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత మంత్రులకు సూచించారు. పౌల్ట్రీ రంగాన్ని ప్రాధాన్యత రంగంగా గుర్తించడంతో పాటు, పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక పాలసీలు రూపొందిస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో--2026 ప్రారంభోత్సవంలో సీఎం ఈ విషయాలను వెల్లడించారు. పౌల్ట్రీ వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమ స్థాపనకు అవసరమైన అనుమతుల విషయంలో జాప్యం తగ్గించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ పంచాయతీల పరిధిలో కొత్త పౌల్ట్రీ యూనిట్ల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చేలా నిబంధనల్లో మార్పులు తీసుకువస్తామని తెలిపారు. పౌల్ట్రీ రంగం వల్ల కోళ్లు, గుడ్ల ఉత్పత్తితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఈ పరిశ్రమ అందిస్తున్న తోడ్పాటు గుర్తించదగినదన్నారు. ప్రతిరోజూ సుమారు 5.30 కోట్ల గుడ్లు ఉత్పత్తి చేస్తూ విద్యార్థులు, యువతకు పోషకాహారం అందించడంలో పౌల్ట్రీ వ్యాపారులు కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే కాలంలో కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలున్నాయని సీఎం ప్రస్తావించారు. అయినప్పటికీ రాష్ట్రంలో రెండేళ్ల అవసరాలకు సరిపడా సన్నబియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. మరోవైపు పౌల్ట్రీ పరిశ్రమకు ప్రధాన ముడిసరుకుగా ఉండే మొక్కజొన్న సరఫరాపై సమస్యలు వస్తున్నాయని ప్రతినిధులు వివరించారని చెప్పారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు, సంబంధిత మంత్రులకు ఆదేశాలు జారీ చేశారు.

డిసెంబర్ 5 నుంచి ఏపీ అసెంబ్లీ..
పెట్టుబడుల రక్షణ బిల్లుపై కీలక నిర్ణయం

పెట్టుబడిదారులకు చంద్రబాబు సర్కార్ భరోసా.. అసెంబ్లీలో కొత్త చట్టం

దాదాపు 15 రోజులపాటు శీతాకాల సమావేశాల నిర్వహణకు ప్రణాళిక

పెట్టుబడుల రక్షణ చట్టం బిల్లును సభ ముందుకు తీసుకురావాలని ప్రభుత్వ యోచన

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పురోగతిపైనా చర్చించే అవకాశం



అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే సంస్థలకు ప్రభుత్వం మారినా ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. పెట్టుబడులకు సంబంధించిన హామీలు, రాయితీలు, భూ కేటాయింపుల విషయంలో భవిష్యత్తులోనూ స్థిరత్వం ఉండేలా నిబంధనలు రూపొందిస్తోంది. ఈ ప్రతిపాదనకు చట్టరూపం ఇచ్చే దిశగా డిసెంబర్ 5 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ శీతాకాల సమావేశాలను వేదికగా చేసుకోవాలని భావిస్తోంది. సుమారు 15 రోజుల పాటు సభా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'పెట్టుబడుల రక్షణ చట్టం' (ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్) బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. అయితే బిల్లు ప్రవేశం, సమావేశాల పూర్తి వ్యవధిపై తుది నిర్ణయం సభా కార్యక్రమాల ఖరారు సమయంలో వెలువడనుంది.

రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడుల నేపథ్యంలో..

ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రానికి సంబంధించి దాదాపు రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో ఒప్పందాలు చేసుకున్న పారిశ్రామిక సంస్థల్లో మరింత విశ్వాసం కల్పించేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. ఒకసారి పరిశ్రమలకు కేటాయించిన భూము లు, ప్రకటించిన ప్రోత్సాహకాలు తదుపరి ప్రభుత్వాల విధాన మార్పులతో ప్రభావితం కాకుండా చట్టపరమైన రక్షణ కల్పించడం ఈ ప్రతిపాదన వెనుక ఉన్న ప్రధాన ఆలోచన. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటన చేశారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా చట్టాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. పెట్టుబడిదారులు కూడా ఈ చట్టం గురించి ఆరా తీస్తున్నారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

కాకినాడలో హోరాహోరీ!



(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా ఎన్డీఏ కూటమి తరుపున జనసేన అభ్యర్థిగా ఆకుల భవాని ప్రవీణ్ పోటీ చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున కాదా సత్య శ్రీ బరిలో నిలిచారు. కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోనే 57 డివిజన్లో ఉండడంతో ఇక్కడి రాజకీయ సమీకరణలు అత్యంత ఆసక్తికరంగా, ఉత్కంఠ భరితంగా మారాయి.

ప్రముఖ వైద్య కుటుంబం...

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సత్య శ్రీ నగరంలో ప్రముఖ వైద్యులు, సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకట్ రమణ సతీమణి. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ఈమెకు నగరంలో వైద్యుల కుటుంబంగా ఉన్న మంచి పేరు, వివాద రహిత ఇమేజ్ కలిసి వచ్చే అంశం. ఎన్నికల ముందే పార్టీలో చేరి నేరుగా బరిలోకి దిగడంతో క్షేత్రస్థాయి క్యాడర్ తో సమన్వయం చేసుకోవడం ఆమెకు కొంత సవాల్ గా మారింది. కూటమి అభ్యర్థి ఆకుల భవాని జనసేన నేత ఆకుల ప్రవీణ్ సతీమణి. అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఆమెకు ఆ వర్గంలో ఉన్న బలమైన పట్టు, పోర్టు సంబంధిత వ్యాపార నేపథ్యం కలిసి వచ్చే అంశాలు. టికెట్ కేటాయింపు సమయంలో జనసేన లో ఆరుగురు ఆశావహులు పోటీ పడడం, ప్రవీణ్ పై గతంలో వచ్చిన కొన్ని ఆరోపణలను విపక్షాలు ప్రస్తావించడం వంటి అంశాలను అధిగమించేందుకు ఓటమినేత్తులు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

కాపులే అధికం..

కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 2.85 లక్షల ఓటర్లలో కాపులు సుమారు 67 వేలు, మత్స్యకారులు 51 వేలు, శెట్టిబలిజ సామాజిక వర్గం 31 వేల వరకు ఉన్నారు. జనసేనకు కంచుకోట లాంటి కాపు ఓటు బ్యాంకు తో పాటు అభ్యర్థి సామాజిక వర్గమైన మత్స్యకార ఓట్లు గుంపు గుత్తగా పడితే కూటమికి భారీ ఆధిక్యం లభించడం ఖాయం. దీనికి టిడిపికి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు, ప్రస్తుతం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బలం తోడు కానుంది. ఇంకోవైపు వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి ఉన్న ఆర్థిక, అంగ బలం, శెట్టి బలిజ, మైనారిటీ, దళిత ఓటు బ్యాంకు వైసీపీకి అండగా నిలవనున్నాయి.

ప్రచారంలో ముందంజ..

ప్రచార పర్వంలో కూటమి ముందు వరుసలో ఉంది. మరోవైపు గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ తో పాటు టిడిపి అగ్రనేతలపై ద్వారంపూడి హాట్ కామెంట్స్ చేసేవారు. దానిని గట్టిగానే తిప్పి కొట్టాలని కూటమి నేతలు వ్యూహంతో పని చేస్తున్నారు. జనసేన తరపున ఎమ్మెల్సీ నాగబాబు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తుండగా.. మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యుల కమిటీ క్షేత్రస్థాయిలో మోహరించింది. టిడిపి సైతం ఈ సీటు తమది అన్నట్టు భావించి సామాజిక వర్గాల వారీగా మంత్రులను, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబులను రంగంలోకి దించి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్ని తానై వ్యవహరిస్తూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని శాయ శక్తులా శ్రమిస్తున్నారు. మొత్తంగా క్షేత్రస్థాయి పరిస్థితులు, ఓటర్ల నాడిని విశ్లేషిస్తే ప్రస్తుత సమీకరణల్లో ఎంబీఏ కూటమి అభ్యర్థి ఆకుల భవాని ప్రవీణ్ కె స్పష్టమైన ఎడ్జ్ కనిపిస్తోంది.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 గురువారం 26-11-2026



అన్నదాన కార్యక్రమానికి రూ.1 లక్ష విరాళం

వనపర్తి క్రైమ్ మిర్రర్: వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప క్షేత్రంలో శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వనపర్తి పట్టణానికి చెందిన లావణ్య రమేష్ నాయుడు దంపతులు రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు.కీ.శే. భాగ్యలక్ష్మి దేవి, కీ.శే. లక్ష్మీనారాయణ గార్ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు దూపం నాగరాజు, నిర్వాహకులు కవిందర్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి గార్లకు అందజేశారు.ఈ సందర్భంగా కొత్తకోటలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఎంతో విశిష్టమైనదని అభివర్ణించిన దంపతులు, అయ్యప్ప సేవా సమితి చేస్తున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ సందర్భంగా వారిని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శాలువతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి..

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోదాడ పట్టణ పోలీసులు



కోదాడ నవంబర్ 25(క్రైమ్ మిర్రర్): కోదాడ: విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని కోదాడ పట్టణ పోలీసులు సూచించారు. పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం హావెల్స్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులను తెరవకూడదని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడటం వల్ల కలిగే ఆర్థిక, మానసిక నష్టాల గురించి వివరించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం చట్టరీత్యా నేరమని వివరించారు. హెల్మెట్ ధరించడం, రహదారి భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, విద్యార్థులు ఎలాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలని హితవు పలికారు. చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా చదువుపై దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని సూచించారు.సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. విద్యార్థులు ఏదైనా సమస్య ఎదుర్కొన్నా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నూతనకల్ - సంగెం గ్రామీణ లింకు రోడ్డుని వెంటనే మరమ్మతులు చేయాలి

పేర్ల నాగయ్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి



నూతనకల్ క్రైమ్ మిర్రర్: నూతనకల్ సంగెం గ్రామీణ లింకు రోడ్డుకు బడ్జెట్ కేటాయించి, వెంటనే మరమ్మతులు చేయాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ పేర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.బుధవారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీకి ,ప్రగతిశీల ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతనకల్ - సంగెం రోడ్డుపై ధర్నా నిర్వహించి, అనంతరం ఎంపీడీవో సునీత కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కామ్రేడ్ పేర్ల నాగయ్య మాట్లాడుతూ, నూతనకల్- సంగెం గ్రామీణ రహదారి ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం వేసినదని, నాటి నుండి నేటి వరకు ఆ రోడ్డుపై మరమతులు చేయని కారణంగా రోడ్డు మొత్తం కంకర తేలి, గుంతలు పడి రహదారి మొత్తం అస్తవ్యస్తంగా మారిందని ఆయన ఆవేదన చెందారు. రోడ్డుపై ప్రయాణం చేస్తున్న అనేక మంది ప్రయాణికులు రోడ్డు గుంతలలో కింద పడి కాళ్లు చేతులు విరగొట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఆయన తెలియజేశారు. అదే విధంగా ఈ గుంతల రోడ్డు మీద రవాణా చేయడం మూలంగా ఆటోల స్పేర్ పార్ట్స్ ఎక్కడికక్కడ ఊడిపోయి ఆటో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ రోడ్డును వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టకపోతే అనేకమంది కాళ్లు చేతులు విరగ్గొట్టుకోవడమే కాకుండా, ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కావున వెంటనే పాలకవర్గాలు, అధికారులు స్పందించి ఈ రోడ్డు అభివృద్ధి కోసం బడ్జెట్ ను కేటాయించి, వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేసినారు. లేనియెడల రాబోయే రోజులలో అన్ని ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు మిరియాల ప్రవీణ్, ఉపాధ్యక్షులు యేషమళ్ళ బాలరాజు, యూనియన్ గౌరవ అధ్యక్షులు కలకోట్ల సైదులు, చిల్పకుంట్ల గ్రామ ఆటో యూనియన్ అధ్యక్షులు వినయ్, నాయకులు ఎలిపెద్ది పాపిరెడ్డి, జటంగి నరసయ్య, భానోత్ రవి, బుల్లెద్దు శ్రవణ్, పులుసు రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో దీక్షా దివస్ కు ఏర్పాట్లు పూర్తి...!

29న బడంగ్ పేట్ లో దీక్షా దివస్ --- సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

కేసీఆర్ దీక్షా దివస్ ను ఘనంగా నిర్వహించాలి --- బీఆర్ఎస్ నాయకులు పిలుపు..!



మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): తెలంగాణ సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్షను స్మరిస్తూ ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మహేశ్వరం నియోజకవర్గ నాయకులు తెలిపారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. తెలంగాణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకపోవడంతో 29-11-2009న ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారని తెలిపారు. "కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో" అనే నినాదంతో 11 రోజుల పాటు దీక్ష చేసి కేంద్రం మెడలు వంచారని కొనియాడారు. ఆ చారిత్రక రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా దీక్షా దివస్ నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ నెల 29న ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు బడంగ్ పేట్ లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ లో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సబితా ఇంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు.మహేశ్వరం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో లో మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, మీర్ పేట్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, ఉద్యమకారుల కన్వీనర్ నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, సిద్దల భరత్, జగన్ మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దొంగతనాల నివారణకు పోలీసుల అవగాహన కార్యక్రమం

అన్నపురెడ్డిగూడెంలో ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించిన వేములపల్లి పోలీసులు



క్రైమ్ మిర్రర్, వేములపల్లి: గొలుసు దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములపల్లి పోలీసులు సూచించారు. బుధవారం రోజు వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నపురెడ్డిగూడెం గ్రామంలో చైన్ స్నాచింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు బంగారు గొలుసులు, ఆభరణాలను బహిరంగంగా ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలను పాఠశాల నుంచి తీసుకురావడానికి వెళ్లే సమయంలో, పొలాలకు వెళ్లేటప్పుడు నిర్మానుష్య మార్గాలను నివారించాలని, రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాల వైపు దృష్టి ఉంచి నడవాలని వివరించారు. ముఖ్యంగా బైక్‌లపై వచ్చే అపరిచితులు దగ్గరకు వచ్చి మాటల్లో పెట్టి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పిల్లలు ఒంటరిగా ఉన్నప్పుడు అపరిచితులను దగ్గరకు రానివ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. గొలుసు దొంగతనం లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే 112 లేదా 100 నంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని, నిందితుల వాహన నంబర్, వెళ్లిన దిశను గుర్తుంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు..

జర్నలిస్ట్ జేఏసీ చైర్మన్ దుస్స భూమన్నకు బీజేపీ నాయకుల ఘన సన్మానం

జైపూర్ నవంబర్ 25 (క్రైమ్ మిర్రర్): జైపూర్ మండల జర్నలిస్ట్ జేఏసీ చైర్మన్‌గా, అలాగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దుస్స భూమన్నను జైపూర్ మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో బీజేపీ జైపూర్ మండల ఇన్‌చార్జి మంత్రి రామన్న, పెగడపల్లి సర్పంచ్ రామగిరి రాము, భారతీయ జనతా యువ మోర్చా జైపూర్ మండల అధ్యక్షులు పల్లికొండ వెంకటేష్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు రాజబత్తుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుస్స భూమన్న మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్న జర్నలిస్టు మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధనే తన ప్రధాన లక్ష్యమని, జర్నలిస్టుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.



ఘనంగా కోదాడ పట్టణంలో సెమీ క్రిస్మస్ ప్రారంభం

కోదాడ నవంబర్ 25 క్రైమ్ మిర్రర్ : కోదాడ: కోదాడ పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ వేడుకల సందర్భంగా కోదాడ పట్టణంలోని నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు.ఈ ప్రారంభ వేడుకల్లో పాస్టర్ యేసయ్య మాట్లాడుతూ, "క్రిస్మస్ ఆనందం ప్రతి ఒక్కరి హృదయాల్లో నిండాలని, వారి శ్రమను, వారి కష్టాన్ని మరచి, క్రీస్తు ప్రభువు హృదయంలో జన్మించాడనే సంతోషం అందరి హృదయాల్లో అధికం కావాలని" ఆకాంక్షించారు.నెల రోజుల పాటు ఈ వేడుకలు జరగనుండగా, ప్రారంభ వేడుకలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని, దేవుని ఆరాధించారు.



నూతన పెన్షన్ మంజూరు పత్రాలు అందజేత

మునుగోడు క్రైమ్ మిర్రర్: మండలంలోని సింగారం గ్రామంలో 27 మందికి నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరయ్యాయి..బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర పంచాయతీ కార్యదర్శి కట్ట గీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అదేవిదంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం అండాలు, ఉప సర్పంచ్ ఉప్పునూతల వెంకటేశ్వర్లు, చండూర్ మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమం.. విద్యార్థుల ప్రయాణ కష్టాలకు పరిష్కారం



గండిపేటక్రైమ్ మిర్రర్: నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించి వారి విద్యాభ్యాసానికి అండగా నిలిచేందుకు నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్, గూడెరా సంస్థ సహకారంతో నర్కుడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కవ్వగూడ, సుల్తాన్‌పల్లి, చౌదరిగూడ గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తగ్గించడంతో పాటు, చదువుపై మరింత ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ సైకిళ్లు అందించిన హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు చేయూతనివ్వడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, నాయకులు తొంట అశోక్, గూడెపు లక్ష్మణ్, ఉపాధ్యాయ బృందం, సంస్థ కోఆర్డినేటర్లు సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీల్లో తెలంగాణకు సిల్వర్ మెడల్





గండిపేటక్రైమ్ మిర్రర్: 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ పోటీలలో తెలంగాణ పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ జట్టు సిల్వర్ మెడల్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీకి చెందిన బిగులర్లను అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అభినందించి కమాండేషన్ సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ పోటీలలో ఏడుగురు సభ్యులతో కూడిన తెలంగాణ పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ జట్టు ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్‌తో పాటు కప్‌ను సాధించింది. ఈ జట్టులో తెలంగాణ పోలీస్ అకాడమీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి, పోలీస్ కానిస్టేబుల్ రాంలాల్‌లు తమ నైపుణ్యంతో కీలక పాత్ర పోషించారు.

అకాడమీ శిక్షణలో విశేష అనుభవం..

హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి, కానిస్టేబుల్ రాంలాల్‌లు ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఔట్ డోర్ విభాగంలో ఇన్‌స్ట్రక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఏడుసార్లు ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ పోటీలలో పాల్గొన్న అనుభవం వీరికి ఉంది. అకాడమీలో శిక్షణ పొందుతున్న పోలీస్ సిబ్బందికి బిగులర్ విభాగంలో మెరుగైన శిక్షన అందిస్తూ వారి నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. తెలంగాణ పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ బృందం జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించడంలో వీరి అనుభవం, కృషి, అకాడమీలో అందిస్తున్న శిక్షణ ఎంతగానో దోహదపడ్డాయి. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ అకాడమీ పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు ఉన్నత ప్రమాణాలతో శిక్షణ అందిస్తోందని తెలిపారు. పోలీస్ బ్యాండ్ అండ్ బిగులర్ శిక్షణలో కూడా వెంకటస్వామి, రాంలాల్‌లు అంకితభావంతో పని చేస్తూ, తమ అనుభవాన్ని ఇతర సిబ్బందికి అందిస్తున్నారని ప్రశంసించారు. జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ పోలీస్ జట్టు సిల్వర్ మెడల్, కప్ సాధించడంలో వీరు పోషించిన పాత్ర అభినందనీయమన్నారు. వారి కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇద్దరికి కమాండేషన్ సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె.ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు టి.భరత్, వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో విషాదం.. కారు ఢీకొని మూడేళ్ల బాలుడు మృతి



గండిపేటక్రైమ్ మిర్రర్: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొఘల్స్ కాలనీలో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు ఢీకొనడంతో అర్బాజ్ (3) అనే చిన్నారి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్స్ కాలనీకి చెందిన అఖిల్ మొహ్లా కుమారుడు అర్బాజ్ బుధవారం సాయంత్రం సమయంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గులాం రియాజ్ కుమారుడు, క్యాబ్ డ్రైవర్ గులాం ఉబేద్ (22) కారును అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. కారు ఢీకొనడంతో చిన్నారి తలకు తీవ్ర గాయాలై ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణ అనంతరం చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడేళ్ల పసివాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మొఘల్స్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నారి కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు



గండిపేటక్రైమ్ మిర్రర్: ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ నేతృత్వంలో 78వ ఆర్ఆర్(2025) బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు చేతనరెడ్డి, హర్ష డెబోరియాలు బుధవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివపత్రాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. 78వ ఆర్ఆర్ బ్యాచ్‌లో భాగంగా తెలంగాణ కేడర్‌కు కేటాయించబడిన ఈ ఇద్దరు ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో నాలుగు వారాల ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం, రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ తదితర అంశాల పై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్‌ను కలిసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో జరిగిన భేటీ ద్వారా రాష్ట్ర పరిపాలన, రాజ్యాంగ వ్యవస్థ, తెలంగాణ ప్రత్యేకతలు తదితర అంశాలపై ప్రొబేషనరీ అధికారులు అవగాహన పొందారు.

ఈగల్ డైరెక్టర్‌ను కలిసిన ప్రొబేషనరీ ఐపీఎస్‌లు....

ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు ఈగల్(ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్ ?మంట్) డైరెక్టర్ సందీప్ శాండిల్యను కలిశారు. ఈ గల్ ఫోర్స్ డ్రగ్ రవాణాను అరికట్టడం , బాధితులకు డి ఎడిక్షన్ సెంటర్లలో చేర్చడం, డ్రగ్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడంలో చేస్తున్న కృషిని తెలుసుకున్నారు. ఈగల్ పని తీరును డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రొబేషనర్లకు వివరించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

అత్తాపూర్ శ్రీ మేధా జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్



గండిపేటక్రైమ్ మిర్రర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అత్తాపూర్ శ్రీమేధా జూనియర్ కళాశాల డైరెక్టర్ నాగఅయ్యన్నబాబు అన్నారు. బుధవారం శివరాంపల్లిలోని విజయానంద్ గార్డెన్‌లో విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీమేధా జూనియర్ కళాశాల డైరెక్టర్ నాగఅయ్యన్నబాబు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమయాన్ని కేటాయించాలన్నారు. ఎప్పటికప్పుడు తమ లక్ష్యాలను నిర్దేశించుకోని రాణించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కళాశాలలో విద్యార్థులకు విజ్ఞానవంతమైన విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్తమ శిక్షణ అందిస్తు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన టీమ్‌తో పాటు క్రీడాకారులకు బహుమతులు, ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు, స్టాఫ్ పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన తేజశ్రీ నిరాహార దీక్ష.. క్షీణించిన ఆరోగ్యం

పోలీసుల అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలింపు..

న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



గండిపేటక్రైమ్ మిర్రర్: న్యాయం కోసం నిరాహార దీక్ష చేపట్టిన మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ ఆరోగ్యం క్షీణించింది. తనకు న్యాయం చేయాలంటూ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ దీక్షను కొనసాగిస్తున్న ఆమెను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. తేజశ్రీ ఆరోగ్యం క్షీణించడం, నిరాహార దీక్ష కొనసాగుతున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన వారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తేజశ్రీ సమస్యను పరిష్కరించాలని, ఆమెకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన శ్రద్ధ చూపాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం



గండిపేటక్రైమ్ మిర్రర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంచిరేవుల ప్రాంతానికి చెందిన ప్రదీప్ సార్కార్(64) ఈ నెల 18వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్



గండిపేటక్రైమ్ మిర్రర్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. నవంబర్ 16, 2026న నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, న్యాయపరమైన చర్యల్లో భాగంగా మొత్తం 22 కేసులను పరిష్కరించి రూ.52,200 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురిని రాజేంద్రనగర్‌లోని 10వ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఎదుట హాజరుపరచగా, వారికి శిక్షలు, జరిమానాలు విధించారు. పి. సుధాకర్‌కు రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధించారు. ఎ. రమేష్, జి. ఆనంద్, కె. బిక్షపతిలకు ఒక్కొక్కరికి ఒక రోజు సాధారణ సమాజ సేవతో పాటు రూ.3,000 చొప్పున జరిమానా విధించారు. మరో 12 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.31,500 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఆరు మందిపై కేసులు నమోదు చేసి రూ.8,700 జరిమానా విధించారు. రహదారి ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉద్యోగులు, సిబ్బందికి ఏజీఎం ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ సూచన

డిజిటల్ అరెస్ట్, డీప్‌ఫేక్, ఏఐ మోసాలపై అవగాహన





మందమర్రి, నవంబరు 25: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కొత్త రూపాల్లో విస్తరిస్తున్నాయని, ఉద్యోగులు, సిబ్బంది డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏజీఎం (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ సూచించారు. జీఎం హెచ్ఆర్‌డీ (కార్పొరేట్) ఆదేశాల మేరకు మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, జీవీటీసీ ఆధ్వర్యంలో మంగళవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సదస్సులో నేర్చుకున్న భద్రతా మెలకువలను కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులకు వివరించి సైబర్ మోసాలపై చైతన్యపరచాలని కోరారు.

నిర్లక్ష్యంతో సంస్థ భద్రతకు ముప్పు

ఐటీ డిప్యూటీ మేనేజర్ కె. రవి దృశ్య ప్రదర్శన ద్వారా సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను వివరించారు. సైబర్ భద్రత ఐటీ విభాగానికే పరిమితం కాదని, సంస్థలోని ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కొత్త తరహా మోసాలపై హెచ్చరిక

డిజిటల్ అరెస్ట్, కాల్ ఫార్వార్డింగ్, కృత్రిమ మేధ ఆధారిత నకిలీ వీడియోలు, మోసపూరిత పెట్టుబడి పథకాలు, హానికర అనువర్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ ఈ-మెయిళ్లు, వెబ్‌సైట్లు, సందేశాల ద్వారా వచ్చే లింకులు, మోసపూరిత ఫోన్ కాల్స్, హానికర సాఫ్ట్‌వేర్లు, సమాచారాన్ని కట్టడి చేసి డబ్బులు డిమాండ్ చేసే ర్యాన్సమ్‌వేర్ దాడులను గుర్తించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, డీజీఎం (సర్వే) భూక్య దేశాయ్, జీవీటీసీ జేటీవో దేవులపల్లి శ్రీనివాస్, సహాయ శిక్షణ అధికారి కె. సుమన్‌తో పాటు జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి మంత్రి పొంగులేటి భరోసా..

ఎంబీబీఎస్ పూర్తి చేసే వరకు ఏటా ఆర్థిక సాయం చేస్తానని అభయం

తొలివిడతగా రూ.50 వేలు అందజేసి అండగా నిలిచిన శీనన్న



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థినికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండగా నిలిచారు. ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు ఏటా ఆర్థిక సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి రామారావు కుమార్తె రిషిత సంగారెడ్డిలోని రాజరాజేశ్వరి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. కళాశాల ఫీజుల చెల్లింపునకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో బుధవారం మంత్రి పొంగులేటిని కలిసి తన పరిస్థితిని వివరించి సాయం కోరింది. విద్యార్థిని అభ్యర్థనపై మంత్రి వెంటనే స్పందించి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాకుండా వైద్య విద్య పూర్తయ్యే వరకు ప్రతి ఏటా అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినికి సూచించారు. మంత్రి చూపిన చొరవకు రిషిత కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, సర్పంచ్ కొత్తపల్లి త్రివేణి వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తపల్లి సుబ్బారావు, సత్యాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన ఆత్మగౌరవానికి అక్షర రూపం.. 'గుగ్గిలం'!

జాషువా స్మృతి కవిత్వ సంకలనం ఆవిష్కరణ

బహుజన సాంస్కృతిక చైతన్యానికి సరికొత్త వేదికగా 'గుగ్గిలం'

బహుజనుల చరిత్రను బహుజనులే రాయాలి

అస్తిత్వాన్ని కాపాడుకోవాలి: డా. ముప్పారం ప్రకాశం



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ బ్యూరో చీఫ్ నవంబర్ 25: అణచివేతల చీకట్లను చీల్చుకుంటూ ఆత్మగౌరవ జ్వాలను వెలిగించే అక్షర సమూహమే 'గుగ్గిలం' అని సాహసం రాష్ట్ర అధ్యక్షులు డా. ముప్పారం ప్రకాశం అభివర్ణించారు. బహుజనుల చరిత్ర, సంస్కృతి, అస్తిత్వ పోరాటాలకు అక్షర రూపమిస్తూ, సామాజిక చైతన్యానికి సాహిత్య ఆయుధంగా నిలిచే జాషువా స్మృతి కవిత్వ సంకలనం 'గుగ్గిలం'ను బుధవారం హైదరాబాద్ ఎల్.బి. నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ప్రభలత, డప్పోల్ల రమేష్ సంపాదకత్వంలో వెలువడిన ఈ సంకలనం బహుజన సాహిత్య, సాంస్కృతిక ఉద్యమంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డా. ముప్పారం ప్రకాశం మాట్లాడుతూ.. మహాకవి జాషువా తన కలం ద్వారా సమాజంలోని అసమానతలు, వివక్ష, అణచివేతలపై గళమెత్తి అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని రగిలించారని గుర్తుచేశారు. జాషువా సాహిత్యం ఒక తరానికే పరిమితమైనది కాదని, తరతరాలకు సామాజిక స్పృహను అందించే గొప్ప సాహిత్య వారసత్వమని పేర్కొన్నారు. ఆ స్ఫూర్తిని నేటి తరాలకు అందించడంలో 'గుగ్గిలం' సంకలనం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. బహుజనులకు గొప్ప జీవన సంస్కృతి, కళలు, సంప్రదాయాలు, సాహిత్య వారసత్వం ఉన్నప్పటికీ వాటికి తగిన గుర్తింపు, గౌరవం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. వేల సంవత్సరాలుగా అణచివేతకు, వివక్షకు గురైన సమాజం తన చరిత్రను తానే లిఖించుకోవాలని, తన సంస్కృతిని తానే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బహుజనుల జీవన విధానం, సామాజిక చైతన్యం, అస్తిత్వం, ఐక్యత వంటి అంశాలను కవిత్వ రూపంలో భావితరాలకు అందించాలనే సంపాదకుల సంకల్పం అభినందనీయమని కొనియాడారు. రాజకీయ పోరాటాలతోనే సామాజిక మార్పు సాధ్యం కాదు.. సాంస్కృతిక చైతన్యమూ అవసరం! సమాజంలో సమూల మార్పు రావాలంటే రాజకీయ ఉద్యమాలతో పాటు సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలు కూడా అంతర్భాగం కావాలని డా. ముప్పారం ప్రకాశం స్పష్టం చేశారు. ఒక సమాజం తన చరిత్రను, సంస్కృతిని, వారసత్వాన్ని మరిచిపోతే తన అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బహుజనం సాంస్కృతిక వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. 'గుగ్గిలం' ఒక పుస్తకంగా మాత్రమే కాకుండా నేటి సమాజపు అనుభవాలకు అక్షర రూపం, అస్తిత్వ పోరాటాలకు ప్రతిరూపం, భవిష్యత్తు తరాలకు చారిత్రక ఆధారంగా నిలుస్తుందని అన్నారు. కవిత్వం, పాటలు, పద్యాల ద్వారా బహుజనుల జీవన వాస్తవాలను, ఆత్మగౌరవ ఆకాంక్షలను వ్యక్తీకరించిన కవులందరూ అభినందనీయులని పేర్కొన్నారు. కళలు, భాష, సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించేలా ఇలాంటి మరిన్ని పుస్తకాలు వెలువడాలని సంపాదకులకు సూచించారు. సంకలనం సంపాదకుల్లో ఒకరైన ప్రముఖ కవి, రచయిత డప్పోల్ల రమేష్ మాట్లాడుతూ.. గతాన్ని గుర్తు చేసుకోవడమే తమ ప్రయత్నం కాదని, సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం పునాదులపై సమసమాజ నిర్మాణానికి సాహిత్యం దోహదపడాలనే లక్ష్యంతో జాషువా స్మృతి కవిత్వ సంకలనం 'గుగ్గిలం'ను తీసుకొచ్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో బహుజన నేత చింతకుంట్ల చింతయ్య, ప్రముఖ న్యాయవాది అలిగె జీవన్, టిపిఆర్పి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవని శేఖర్, బీఎస్పీ నాయకులు దేవిడ్, స్వేరో నాయకులు బత్తుల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో కార్మికుడి అనుమానాస్పద మృతి



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ బృందావన టౌన్‌షిప్ కాలనీలో కార్మికుడు కుందన్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆర్జీఐ విమానాశ్రయంలో కార్మికుడిగా పనిచేస్తున్న అతడు నివాసముంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మృతదేహంగా కనిపించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కుందన్ కుమార్ గత రెండేళ్లుగా విమానాశ్రయంలో పనిచేస్తూ ఇద్దరు స్నేహితులతో కలిసి బృందావన టౌన్‌షిప్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 24న ఉదయం నైట్ డ్యూటీ ముగించుకుని గదికి వచ్చి నిద్రపోయాడు. రూమ్‌మేట్స్ రాత్రి తిరిగి వచ్చినా తలుపు తీయకపోవడంతో అతడు నిద్రపోతున్నాడని భావించి మరో గదిలోకి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం కూడా తలుపు తీయకపోవడంతో ఇంటి యజమాని, స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే తాడును కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. వ్యక్తిగత కారణాలు లేదా ప్రేమ వ్యవహారంలో విఫలమవడం వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని రూమ్‌మేట్ నిఖిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శంషాబాద్‌లో కారు, బైక్‌తో ఢీకొట్టి యువకుడిపై బేస్‌బాల్ బ్యాట్‌తో దాడి

తలపై తీవ్ర గాయం.. ఆసుపత్రికి తరలించిన క్యాబ్ డ్రైవర్లు

గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్‌లోని రోటరీ-1 వద్ద బుధవారం తెల్లవారుజామున యువకుడిపై దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. పాత కక్షల నేపథ్యంలో కారుతో బైక్‌ను వెనుక నుంచి రెండుసార్లు ఢీకొట్టి, అనంతరం బేస్‌బాల్ బ్యాట్‌తో తలపై దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో సీనియర్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తున్న తేలగతోటి నాగభూషణరావు (26) బుధవారం ఉదయం సుమారు 5.30 గంటలకు స్నేహితుడి పల్సర్ బైక్‌పై శంషాబాద్ నుంచి విమానాశ్రయానికి వెళ్తుండగా రోటరీ-1 వద్ద ప్రసన్నకుమార్ అనే వ్యక్తి ఎరుపు రంగు శాంత్రో కారుతో బైక్‌ను వెనుక నుంచి రెండుసార్లు ఢీకొట్టినట్లు ఆరోపించారు. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన బాధితుడిని నిందితుడు బెదిరించి, కారులో ఉన్న బేస్‌బాల్ బ్యాట్‌తో తలపై దాడి చేయడంతో తీవ్ర రక్తగాయమైంది. సమీపంలోని క్యాబ్ డ్రైవర్లు వెంటనే స్పందించి బాధితుడిని ఆసుపత్రికి తరలించి, డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వనభోజనాలు అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: కురుపాటి సుదర్శన్



చండూరు, క్రైమ్ మిర్రర్: మాదిగ ఉపకులాల కార్తీకమాస వనభోజనాలు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్ పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో ఈనెల 29వ తారీఖున మాదిగల అలయ్ బలయ్ కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాన్ని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ మహోత్తర కార్యక్రమ ముఖ్య ఉద్దేశం మాదిగ మరియు మాదిగ ఉపకులాల మధ్య ఐక్యతను పెంపొందించడం సామాజిక రాజకీయ చైతన్యాన్ని బలోపేతం చేయటం మాదిగ ఉపకులాల హక్కులు అభివృద్ధిపై చర్చించటం భవిష్యత్తు కార్యాచరణకు సమిష్టి నిర్ణయాలు తీసుకోవటం బహుజన సమాజంలో ఐక్యత సోదరా భావాన్ని చాటి చెప్పడం లాంటివి అని తెలిపారు, ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాదిగ మంత్రులు ఎమ్మెల్యేలు మాదిగ మేధావులు ఎమ్మెల్సీలు కార్పొరేషన్ చైర్మన్లు వివిధ జిల్లాల మాదిగ ముఖ్య నాయకులు హాజరు కారున్నారని తెలిపారు , కావున ఈ వనభోజన మహోత్సవానికి మాదిగ-ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 26-11-2026
7



జగ్గారెడ్డి ఇంట పెళ్లి సందడి..



అంగరంగ వైభవంగా భరత్ సాయి రెడ్డి వివాహం!

గంజ్ మైదాన్‌లో కన్నులపండువగా పెళ్లి వేడుకలు

నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి,

తెలంగాణ రాష్ట్ర రాజకీయ ప్రముఖులు

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 25: సంగారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి ఇంట పెళ్లి సందడి అంబరాన్నంటింది. జగ్గారెడ్డి, నిర్మల దంపతుల కుమారుడు భరత్ సాయి రెడ్డి, పాలక్ పటేల్‌ల వివాహ మహోత్సవం మంగళవారం సంగారెడ్డిలోని గంజ్ మైదాన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వివాహ వేడుకకు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివాహ వేడుకను పురస్కరించుకుని గంజ్ మైదాన్‌ను పూల అలంకరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివాహ వేదికపై నూతన వధూవరులు భరత్ సాయి రెడ్డి, పాలక్ పటేల్‌లు ఒక్కటయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు తరలిరావడంతో గంజ్ మైదాన్ సందడిగా మారింది. తమ కుమారుడి వివాహాన్ని ఘనంగా నిర్వహించేందుకు జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బంధుమిత్రుల సందడి, ప్రముఖుల రాకపోకలు, ఆత్మీయ పలకరింపుల మధ్య వివాహ వేడుక వైభవంగా సాగింది. సంగారెడ్డిలో జరిగిన ఈ వివాహ మహోత్సవం రాజకీయ, సామాజిక వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తెలుగు రాష్ట్రాల్లో పురుషులను కలవరపెడుతున్న ప్రోస్టేట్ క్యాన్సర్

ఏపీ, తెలంగాణల్లో పెరుగుతున్న ప్రోస్టేట్ క్యాన్సర్ కేసులు

వయసు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపిస్తున్న ముప్పు

మూత్ర సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దన్న వైద్యులు

ముందస్తు పరీక్షలతోనే వ్యాధిని నయం చేయడం సులభం



తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పురుషుల ఆరోగ్యాన్ని ప్రోస్టేట్ క్యాన్సర్ తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పురుషుల్లో ఎక్కువగా నమోదవుతున్న టాప్ 4 క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటిగా నిలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రెండు రాష్ట్రాల్లోనూ ఈ క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతుండటంతో ఇది ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. గణాంకాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో 2026 సంవత్సరంలో పురుషులలో కొత్త క్యాన్సర్ కేసుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ వాటా 6.9 శాతంగా (సుమారు 2,020) ఉంది. రాష్ట్రంలో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, కొలొరెక్టల్ క్యాన్సర్ల తర్వాత ప్రోస్టేట్ క్యాన్సర్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అలాగే తెలంగాణలో క్యాన్సర్ కేసుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ వాటా 6.1 శాతంగా (సుమారు 1,300 కేసులు) ఉంటుందని, ఇక్కడ కూడా ఇది నాల్గవ స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రధానంగా వయసు పైబడిన పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సరైన చికిత్స ద్వారా పూర్తి స్థాయిలో నయం చేసే అవకాశాలు మెరుగవుతాయి. ప్రోస్టేట్ క్యాన్సర్‌కు సంబంధించి కొన్ని ప్రధాన హెచ్చరిక సంకేతాలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో తరచూ మూత్ర విసర్జన చేయాల్సి రావడం, మూత్ర విసర్జన ప్రారంభించడంలో ఇబ్బంది కలగడం, మూత్ర ప్రవాహం బలహీనంగా లేదా ఆగి ఆగి రావడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే మూత్రంలో గానీ, వీర్యంలో గానీ రక్తం పడటం, నడుము కింది భాగం, తుంటి లేదా కటి భాగంలో నిరంతరం నొప్పి కొనసాగడం వంటివి కూడా ఈ క్యాన్సర్ ప్రధాన లక్షణాలుగా ఉంటాయి. అయితే ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించక పోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా, పైన పేర్కొన్న లక్షణాలు కేన్సర్ కాని సాధారణ ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదల (నాన్-క్యాన్సరస్ ఎన్‌లార్జ్‌మెంట్) ఉన్నప్పుడు కూడా కనిపించే అవకాశముంది. అందువల్ల పురుషులు మూత్ర సంబంధిత మార్పులను తేలికగా తీసుకోకుండా, అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నిర్మల్‌లో కుమార్తె పెళ్లి కోసం దాచిన రూ.10 లక్షల నగదు, బంగారం అగ్నికి ఆహుతి

ఆడబిడ్డ పెళ్లి చేసి అత్తారింటికి పంపాలని ఆ పేద తల్లిదండ్రులు కలలు కన్నారు. రూపాయి రూపాయి కూడబెట్టి దాచుకున్న సొమ్ము, చేయించిన బంగారు నగలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఒక్క ప్రమాదం ఆ కుటుంబం కళ్లముందే వాళ్ల స్వప్నాలను బూడిద చేసింది. షార్ట్ సర్క్యూట్ రూపంలో వచ్చిన మంటలు ఆ పేదింటి భవిష్యత్తును అగ్నికి ఆహుతి చేశాయి. నిర్మల్ జిల్లా బాసర పరిధిలోని రవీంద్రపూర్ కాలనీలో షేక్ ఇబ్రహీం నివాసంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. క్షణాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించి తీవ్ర ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. కూతురి పెళ్లి కోసం ఇబ్రహీం కుటుంబం ఎంతో కష్టపడి దాచిన దాదాపు రూ.10 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం ఈ ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



తిరుమలకు బయలుదేరనున్న సీఎం చంద్రబాబు

శ్రీవారికి భారీ ఎత్తున బంగారం సమర్పించనున్న భక్తుడు

సీఎం సమక్షంలో కిరీటం, పద్మపాదాలను అధికారికంగా స్వీకరించనున్న టీటీడీ

దర్శనానంతరం భద్రాద్రి కొత్తగూడెం వెళ్లనున్న ముఖ్యమంత్రి

సాయంత్రం తిరిగి అమరావతికి చేరుకోనున్న చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తిరుమల పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడంతో పాటు, ఓ భక్తుడు సమర్పించే భారీ బంగారు కానుకల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రి సమక్షంలో సదరు భక్తుడు స్వామివారికి దాదాపు 121 కిలోల బంగారు ఆభరణాలను సమర్పించనుండగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వాటిని అధికారికంగా స్వీకరించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 8.30 గంటలకు ఆయన అమరావతి నుంచి తిరుపతికి బయలుదేరతారు. ఉదయం 10.00 గంటలకు తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రాంగణంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఘాట్ రోడ్డు మీదుగా ప్రయాణించి, ఉదయం 10.45 గంటలకు తిరుమలలోని గాయత్రీ నిలయానికి చేరుకుంటారు. అనంతరం ఉదయం 11.10 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ముఖ్యమంత్రి శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకుంటారు. దర్శనం పూర్తయిన తర్వాత, ఉదయం 11.35 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఓ భక్తుడు స్వామివారికి కానుకగా అందజేస్తున్న 121 కిలోల బంగారు ఆభరణాలు, అందులో భాగంగా శ్రీవారి దివ్య కిరీటం, పద్మపాదాల ఆభరణాలను టీటీడీ పాలకమండలి, అధికారులు అధికారికంగా స్వీకరించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి భాగస్వామ్యం కానున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి తిరుపతి నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు బయలుదేరి వెళతారు. అక్కడ తన కార్యక్రమాలు ముగించుకుని, సాయంత్రం 4.30 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని టీటీడీ అధికార యంత్రాంగం మరియు జిల్లా పోలీసులు తిరుమలలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



నాంపల్లి రైల్వే స్టేషన్ 120 ఏళ్ల చారిత్రక ముఖద్వారం కూల్చివేత..

చరిత్రకారుల ఆందోళన

1907 నాటి నాంపల్లి రైల్వే స్టేషన్ ముఖద్వారం తొలగింపు

రూ.327 కోట్ల వ్యయంతో అమృత్ భారత్ పనులు

రక్షిత జాబితాలో లేనందునే కూల్చివేసినట్లు తెలిపిన రైల్వే శాఖ

చరిత్రను కాలరాస్తున్నారంటూ వారసత్వ సంపద ప్రేమికుల ఆవేదన

చారిత్రక హైదరాబాద్ నగరంలో మరో శతాబ్దాల నాటి ప్రాచీన నిర్మాణం కనుమరుగైంది. సుమారు 120 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన నాంపల్లి (హైదరాబాద్-దక్కన్) రైల్వే స్టేషన్ పాత ముఖద్వారాన్ని (ట్యుఎన) రైల్వే శాఖ కూల్చివేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకం ఆధునీకరణ పనుల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.నాంపల్లి రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు రూ.327 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు పనులు 2024లోనే ప్రారంభం కాగా, స్టేషన్ ప్రాచీన ముఖద్వారాన్ని కూల్చివేసే ప్రక్రియ కొద్ది వారాల క్రితం మొదలైంది.ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీ పాషా హయాంలో 1907లో ఈ హైదరాబాద్-దక్కన్ స్టేషన్‌ను నిర్మించారు. ఆ కాలంలో హైదరాబాద్‌ను బొంబాయి (ప్రస్తుత ముంబై)తో అనుసంధానించడంలో ఈ స్టేషన్ అత్యంత కీలక పాత్ర పోషించింది. నిజాం కాలం నాటి విశిష్ట నిర్మాణ శైలికి అద్దం పట్టే ఈ స్టేషన్ నుంచి ప్రస్తుతం నిత్యం 45 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.పురాతన ముఖద్వారాన్ని కూల్చివేయడంపై చరిత్రకారులు, వారసత్వ ప్రేమికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునికీకరణ పేరిట నగర చారిత్రక ఆనవాళ్లను నాశనం చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని డెక్కన్ హెరిటేజ్ ట్రస్ట్‌కు చెందిన మహమ్మద్ సఫియుల్లా అన్నారు. హైదరాబాద్ చరిత్రలో ఇదొక విచారకర పరిణామమని ఆయన పేర్కొన్నారు. స్థానిక నిపుణులు, చరిత్రకారులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే ఈ కూల్చివేతలు చేపట్టారని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) హైదరాబాద్ కన్వీనర్ అనురాధా రెడ్డి ప్రశ్నించారు. ఈ విమర్శలపై దక్షిణ మధ్య రైల్వే వర్గాలు భిన్నంగా స్పందించాయి. అధికారికంగా నాంపల్లి రైల్వే స్టేషన్ రక్షిత వారసత్వ (హెరిటేజ్) కట్టడాల జాబితాలో లేదని, అందుకే పునర్నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి అంక్షలు లేవని ఓ సీనియర్ రైల్వే అధికారి వివరించారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడానికే ఈ మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.నగరంలో చారిత్రక రైల్వే భవనాలు నేలమట్టం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణంలో భాగంగా 2025 ఫిబ్రవరిలో అక్కడి చారిత్రక భవనాన్ని తొలగించారు. మరోవైపు, కాచిగూడ రైల్వే స్టేషన్‌కు అధికారికంగా రక్షిత హెరిటేజ్ హోదా ఉండటంతో, దాని మూల రూపాన్ని దెబ్బతీయకుండా ఆధునికీకరణ ప్రణాళికల నుంచి మినహాయించారు. ఈ క్రమంలో, ప్రాచీన ప్రాధాన్యం ఉన్న కట్టడాలను కూల్చివేసే లోపే వాటికి రక్షిత హోదా కల్పించాల్సిన బాధ్యత ఉందని చరిత్రకారులు సూచిస్తున్నారు.

హెచ్ఎండీఏ కార్యాలయం ముట్టడి.. అమీర్ పేటలో ఉద్రిక్తత

హెచ్ఎండీఏ ఈ-వేలాన్ని వ్యతిరేకిస్తూ అమీర్‌పేట ప్రధాన కార్యాలయం ముట్టడి

కూకట్‌పల్లి, మియాపూర్ పరిధిలో రూ.5 వేల కోట్ల విలువైన భూముల విక్రయంపై నిరసన

నిరసనలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు



హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి, మియాపూర్, మూసాపేట హుడా ట్రక్ పార్క్ ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను విక్రయించాలన్న నిర్ణయంపై విపక్షాలు భగ్గుమన్నాయి. ఈ నెల 27న హెచ్ఎండీఏ నిర్వహించ తలపెట్టిన ఈ-వేలాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, వామపక్ష పార్టీల నేతలు అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు.కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నేతలు, స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.హైదరాబాద్ నగరంలోని భూములను అమ్మడమేనా రేవంత్ రెడ్డి ప్రజాపాలన?" అంటూ ఈ సందర్భంగా మాధవరం నిలదీశారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మడం వల్ల రాష్ట్ర సంపద పెరగదన్నారు. ప్రజోపయోగ అవసరాలు, పాఠశాలలు, ఆసుపత్రుల కోసం కేటాయించాల్సిన భూములను వాణిజ్య అవసరాలకు విక్రయించడం సరికాదని మండిపడ్డారు.ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు నిరసనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఆందోళన కారణంగా రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

డేటింగ్‌లో శ్రద్ధా కపూర్..

బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్ గతేడాది బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. రాజ్‌కుమార్ రావు నటించిన స్త్రీ-2 మూవీతో సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంది ముద్దుగుమ్మ. నాగిన్ మూవీతో పాటు మరో రెండు చిత్రాల్లో కనిపించనుంది. అటు షూటింగ్‌లతో బిజీగా ఉండే శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది. ఎక్కడికెళ్లినా నెట్టింట పోస్టులు పెడుతూనే ఉంది. గతంలో స్క్రిప్ట్ రైటర్ రాహుల్ మోడీతో ఉన్న ఫోటోలు షేర్ చేయడంతో శ్రద్ధాపై డేటింగ్ రూమర్స్ వినిపించాయి. ముంబయిలో డిన్నర్ డేట్ తర్వాత అతనితో కలసి రెస్టారెంట్ నుంచి బయటకు వస్తున్న వీడియోలు అప్పట్లో వైరలయ్యాయి. ఆ తర్వాత చాలాసార్లు అతనితో కలిసి జంటగా కనిపించింది.అనిల్ అంబానీ పెళ్లి వేడుకలోనూ మెరిశారు. దీంతో వీరిద్దరి డేటింగ్ నిజమేనని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తూనే ఉంది. తాజాగా శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసింది. మీ కోపా తాపాలను భరించే వ్యక్తి మీ లైఫ్‌లో కనుగొనండి అంటూ వీడియోకు క్యాప్షన్ రాసుకొచ్చింది. అంతేకాకుండా తన బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తోన్న రాహుల్ మోదీని ట్యాగ్ చేసింది. ఆ వీడియోను రాహులే తీసినట్లు తెలుస్తోంది. మీ జీవితంలో హగ్ లాంటివి వినే వాళ్లు ఎవరై ఉంటారని హింట్ ఇచ్చింది. ఇది చూసిన అభిమానులు రాహుల్‌తో డేటింగ్ కన్‌ఫామ్ చేసేసిందని కామెంట్స్ పెడుతున్నారు. ఈ వీడియోతో రాహుల్‌తో డేటింగ్‌లో ఉన్నట్లు పరోక్షంగానే చెప్పేసిందని పోస్ట్ చేస్తున్నారు. గతడాది డిసెంబర్‌లోనూ రాహుల్‌తో వడా పావ్ డేట్ గురించి పోస్ట్ చేసింది. అంతకుముందు ఆమె ఫోన్ వాల్‌పేపర్‌లో అతనితో దిగిన ఫోటోతో దొరికిపోయింది. ఇవాళ పోస్ట్ చేసిన వీడియోతో వీరిద్దరి డేటింగ్ ఉన్నట్లేనని అభిమానులు భావిస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే చివరిసారిగా కనిపించింది. ప్రస్తుతం ఆమె నిఖిల్ ద్వివేది తెరకెక్కిస్తోన్న 'నాగిన్'లో కనిపించనుంది.



అందుకే ఇంకా పెళ్లి చేసుకోలేదు: అమీషా పటేల్

తనకు చాలా పెళ్లి ప్రతిపాదనలు వచ్చాయని కానీ అన్నింటినీ నటన కోసం వదులుకున్నట్లు నటి అమీషా పటేల్ తెలిపారు. 'బద్రి', 'నాని', 'నరసింహుడు' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన అమీషా పటేల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి మాట్లాడారు. 50 ఏళ్లు వచ్చినా తాను ఇంకా ఎందుకు పెళ్లి చేసుకోలేదో తెలిపారు. ఒంటరిగా ఉండడానికి గల కారణాన్ని వెల్లడించారు. "ఇప్పటికీ ఎన్నో వివాహ ప్రతిపాదనలు వస్తున్నాయి. నా వయసులో సగం వయసు ఉన్నవారు కూడా నన్ను పెళ్లి చేసుకుంటామని అంటున్నారు. కానీ, వారంతా పెళ్లి అనంతరం నటనకు దూరంగా ఉండాలన్న నిబంధన పెడుతున్నారు. అందుకే తిరస్కరించాను. మనల్ని ప్రేమించేవారు మనం కెరీర్‌లోనూ ముందుకువెళ్లాలని కోరుకోవాలి. నేను కెరీర్ కోసం చాలా కోల్పోయాను. గతంలో ఒకరిని ప్రేమించా. కానీ, అతడు నేను నటించడానికి వీల్లేదని చెప్పాడు. ప్రేమ కంటే కెరీర్ గొప్పదని వదులుకున్నా. నేనేం పెళ్లికి వ్యతిరేకం కాదు. దానికి తగిన వ్యక్తి నాకు కనిపించినప్పుడు పెళ్లి చేసుకుంటాను" అని అమీషా తెలిపారు.ఇక సినిమాల విషయానికొస్తే.. అమీషా ఐదేళ్ల విరామం తర్వాత 'గదర్ 2'లో నటించారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.680 కోట్లకు పైగా వసూలుచేసింది. గతేడాది 'తౌబా తేరా జల్వా' అనే చిత్రంలో కనిపించారు. అయితే దీనితర్వాత ఆమె మరో ప్రాజెక్ట్‌ను అంగీకరించకపోవడం గమనార్హం.



నాగచైతన్య లీడ్ రోల్ లో వృషకర్మ..

కార్తీక్ దండు దర్శకత్వంలో చిత్రం

"వృషకర్మ సినిమాకు హీరోని నేను కాదు.. ఈ చిత్రానికి అసలైన మొదటి హీరో మా డైరెక్టర్ కార్తీక్ దండు" అని యువసామ్రాట్ నాగచైతన్య స్పష్టం చేశారు. నెల్లూరులో అత్యంత వైభవంగా నిర్వహించిన 'వృషకర్మ' చిత్ర వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన ఎందరో గొప్ప దర్శకులు దేశవ్యాప్తంగా సత్తా చాటారని, అతి త్వరలోనే ఆ గొప్ప దర్శకుల జాబితాలో కార్తీక్ దండు కూడా తప్పకుండా చేరతాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైన నాటి అనుభవాలను పంచుకుంటూ.. "కార్తీక్ మొదట నాకు కథ చెప్పినప్పుడు దీనికి పోల్చడానికి ఎలాంటి రిఫరెన్స్ లేదు. ఎంతో సరికొత్త ఆలోచనతో, ఎక్కడా చూడని విజువల్స్‌తో పూర్తి ఒరిజినల్ కథను రాశాడు. ఎవరైనా కథ గురించి అడిగితే ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడ ముగించాలో కూడా నాకు అర్థమయ్యేది కాదు. కానీ ఈ సినిమా కోసం మేం పడ్డ కష్టం ట్రైలర్ చూస్తే అందరికీ అర్థమవుతుందని నమ్మాను. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది" అని నాగచైతన్య పేర్కొన్నారు. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల తీవ్రత వల్ల దర్శకుడు కార్తీక్ ఈ కార్యక్రమానికి రాలేకపోయాడని చైతన్య వెల్లడించారు. "చిత్ర నిడివి 2 గంటల 50 నిమిషాలు ఉంటే, అందులో దాదాపు 2 గంటల 40 నిమిషాల పాటు ప్రతి ఫ్రేమ్‌లోనూ అద్భుతమైన వీఎఫ్ఎక్స్ వర్క్ ఉంటుంది. ఇంత భారీ విజువల్ వండర్‌ను తెరపైకి తీసుకురావడానికి దర్శకుడు, ఎడిటర్ నవీన్ నూలి, విజువల్ ఎఫెక్ట్స్ బృందం అహర్నిశలు శ్రమిస్తున్నారు" అని వివరించారు. సహ నటీనటుల ప్రతిభను ప్రస్తావిస్తూ.. చిత్రంలో స్పర్శ్ శ్రీవాస్తవ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని నాగచైతన్య అన్నారు.

టొవినో-నజ్రియా ఓ ప్రేమకథ

'రాజా రాణి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది మలయాళీ నటి నజ్రియా నజీమ్. గతేడాది 'సూక్ష్మదర్శిని'తో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న ఈమె.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హీరో టొవినో థామస్, నజ్రియా ప్రధాన పాత్రలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ముహ్సిన్ పరారి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రాన్ని ఏవీఏ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తొలిసారి తెరను పంచుకోనున్న టొవినో, నజ్రియా జోడీ కోసం సరికొత్త ప్రేమకథగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో షూటింగ్ మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.